సాగిపోతోంది. ఇప్పుడు నీళ్ళను చూస్తే నాకు భయం, ఎప్పుడైన స్నానానికి వెళ్ళినా (వెళ్ళను) మెట్లమీదే కూర్చునిచెంబుతో రెండు చెంబుల నీళ్ళు తలమీద పోసుకుని మళ్ళీ వచ్చి పంపుకింద కూర్చుంటాను. ఇప్పటికైనా బోధపడిందా – లేదూ మీదీ మట్టిబుర్రే నన్నమాట మావారిలాగ... అరుగో షటప్ గారొస్తున్నారు. (వేర్ ది మైండీజ్ వితవుట్ ఫియర్ అని చదువుతున్నాడు పెద్దపిల్లాడు) అవును వేర్‌ది మైండ్ ఈజ్....

# గృహస్థాశ్రమం

ఇల్లు కట్టడం డామ్ యీజీవోయ్ అంటారు మావారు. కట్టండి చూద్దాం అని మనం అంటె ఆ వెధవ సామెత ఒకటి అడ్డొస్తోందోయ్ అంటారు తప్పంతా సామెతదైనట్లూ మనంరడీగానే వున్నట్టు. మనంపైన ఇల్లు కట్టుకోవాలంటే కింద జాగా వుండాలా వద్దా? అదేం వినిపించుకోరు మా గురువుగారు. మేం ఇల్లు కట్టడం గురించి ఆలోచించి నప్పుడల్లా జాగా విషయం మర్చిపోతూ వుంటాం. ఆఫ్టరాల్ యిల్లు కట్టాలనే సంకల్పమే వుండాలిగాని జాగా వుంటేనేం లేకపోతేనేం? ఫస్ట్ సంకల్పం, మనో నిబ్బరం, గుండె దిటవు కావాలంటారు. ఇల్లు కట్టుకోక పోవటం వలన మాకు చాలా హారిబుల్‌గా వుంటో వుంటుంది అప్పుడప్పుడు. ఓ గోడని మేకు కొట్టుకోవాలని వుంటుందా వుండదా మీరే చెప్పండి. మనకి గోడలకి సున్నాలు వేయించాలి అని మనసు పుట్టినపుడు ఎవరి గోడలకు సున్నాలు వేస్తాంచెప్పండి. సున్నాలు వెయ్యాలంటే మనకి గోడలుండాలా అక్కర్లేదా? మనకి ఇల్లు అద్దెకివ్వాలనుంటుంది. అద్దె పెంచాలని వుంటుంది. ఓ యిల్లు కట్టుకోకుండా ఆసరదా ఎలా తీరుతుంది? దొడ్లో ఇసకపోయించాలనిపిస్తుంది. ఇసుక పోయిద్దా వంటే యిల్లూ దొడ్డి వుండాలా అక్కర్లేదా? ఓ తాకట్టు పెట్టాలన్నా అమ్మాలన్నా ముందు ఇల్లు వుండాలా అక్కర్లేదా – కొందరంటారు ఇల్లు కట్టుకోవాలనే కోరిక కలగటం పరమ ఫూలిష్షని. అద్దె కొంపల్లో వుంటం నాగరికతా ఇల్లు కట్టుకోవటం బార్బరస్సుట. పక్కింటి పాపాయిని ముద్దెట్టుకుని సంతోషించటం మంచిదా, మనవే అవరోన్ ప్రాడక్ట్ (ఇది మా స్వంత తయారీ) అని పాపాయికోసం పాపం చేయటం మంచిదా? ఇల్లు కట్టుకోవటం పుణ్యమో పాపమో అదలాగుణ్ణిండికాని మనం ఇల్లుకట్టుకోకపోతే మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరుండదు. మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరులేకపోయాక మనకెంత దిగులుగా వుంటుంది? బిల్లుకలక్టరు శుభలేఖలు పట్టుకొచ్చినట్లు నోటీసులు పట్టుకొచ్చి యివ్వటం ఇంటిపన్ను ఎప్పుడుకడతారా అని అడగటం కడతాంలేవోయ్ అని మనం అనటం వాడువెళ్ళి మరి నలుగురిని వెంటేసుకు రావటం యిలాంటి చిల్లర సరదాలు మనకి ఇల్లులేకపోతే మన జన్మలో తీరవు. మనింట్లో దొంగలు పడ్డారనుకోండి.

ఫలానా వారింట్లో పడ్డారని చెప్పకుండా ఫలానా వారింట్లో అద్దెకుంటున్న వారింట్లో దొంగలు పడ్డారని అంతా చెప్పుకుంటారు. ఇటు దొంగలకీ, అటు దొంగలు కానివారికీ కూడా మనం లోకువే.

ఇలా పోరగా పోరగా ఒక రోజున మావారు వెళ్ళి ఇంటివాడితో మేం ఇల్లుకట్టుకుంటున్నామండీ అని చెప్పారు. ఎక్కడెక్కడా అని వాడు కుర్చీలోంచి లేవబోయి లేవలేక మావార్ని కూడా ఒక కుర్చీలో కూచోండి కూచోండ్సార్ కూచోండన్నాడు. కట్టబోయే యిల్లు గురించి మావారు చిన్న లెక్చరిస్తూండగా వారు ఎక్కడెక్కడ అని అడుగుతోనే వున్నాడు. అంగుళం మందం గోడలూ, అరంగుళం మందం పైకప్పు తుఫానులో కూడా మిగతా యిళ్ళన్నీ వచ్చి దీనిమీద పడాల్సిందేకాని యిదెక్కడికి పోదన్నారు. నేల గచ్చు చేయించం. మాకుకావలసిన ఆహారాన్ని అక్కడే పండించుకుంటాం అని గ్రీన్ రివల్యూషన్ గురించి కూడా అప్పుడే మాట్లాడేశారు. మావారు వ్యావసాయిక విప్లవాన్ని గృహనిర్మాణ పథకాన్ని కలగా పులగంచేసేస్తున్నారని గ్రహించిననేను అమ్మ అప్పచ్చి చేసింది తిండానికి రమ్మని చెప్పమని మాచంటిని పంపించా - అది తిన్నగా హౌవుస్ వోనర్ మరియు ల్యాండ్‌లార్డ్‌ని అప్పచ్చి పెట్టమని ముందు అడిగి తరువాత పీడించసాగింది. నేనేమీ అప్పచ్చిలు వండలేదే తల్లీ అని ఆ యిల్లు గల ఆసామీ కంగారు పడిపోసాగాడు. ఏమండీ మీరు వంట బాగా చేస్తారని ఎవరో చెప్పగా ఎక్కడో విన్నానండీ అని మావారు మా చంటిని ఎత్తుకుని నీకు అమ్మ నడిగి అప్పచ్చి పెట్టిస్తాను రా అని తీసుకొచ్చేశారు. "వ్హాట్, అప్పచ్చంటుం దేవిటి? దీని లాంగ్వేజీ బోధపడకుండా వుంది" అన్నారు. అటుకులు తొక్కానులెండి బెల్లంవేసి నాలుగు కొబ్బరి ముక్కలు పడేసి - అది పెట్టమంటూంది అన్నాన్నేను. తొక్కడవేమిటి కాలేసి తొక్కినట్లు.... తినే వస్తువుకు ఏదైనా లవ్లీగా, రొమాంటిక్‌గా స్టయిల్‌గావుండే పేర్లుపెట్టి చెప్పాలిగాని తొక్కాను కాల్చాను అంటూ బ్రూట్‌లా మాట్లాడకు అని కోప్పడ్డారు. తొక్కుడు పచ్చడి తొక్కుడు లడ్డూ మీ కిష్టవేగదా (అంటే) అఫ్‌కోర్స్ అన్నారు "కాని నీ చెప్పటం అనాలిసిస్ బావులేదే పిల్లా" అన్నారు మళ్ళీ. బండపెట్టీ నూరితే బండపచ్చడి వస్తుంది - అది మీ కిష్టమేకదా (అఫ్‌కోర్స్) మరి దానికేం చెప్తారు? "బండ పచ్చడికి రేపట్నుంచి మనోరమ అని పేరెట్టు. తొక్కుడు పచ్చడికి మమత అనిపెట్టు వేపుళ్ళన్నిటికి నీలిమ అను. గోంగూరకి కాళిమ అను దోసకాయపప్పుకి సుజాత అను. ఒడియాలకు అరుణ కిరణాలను. యిలాగే కవులు తమ స్వంత సంకేతాలను వాడినట్లు సుకుమారమైనలవ్లీ శబ్దాలను పేర్చుకుంటూపో (అవున్లెండి - వంటెలా తగులబడితె మీకెందుకు) తొక్కుడు లడ్డూని మధురిమ అంటే పోలే - "

అప్పుడు కట్ చేసి మన ఇంటికి ఏం పేరు పెట్టుకుందావండీ అనడిగాను ఒరిజినల్ సబ్జెట్ వైపు లాగుతూ, పూరిల్లువేస్తే పూరింటివార్ అవుతాము. మేడవేస్తే మేడ్వార్ అవుతాం. డాబావేస్తే డాబాల్వార్ అవుతాము. మనం అవుతాం సరేలెండి, మనిల్లు ఏవిటవుతుంది? ఇల్లు ఏమీ అవదు - వున్నన్నాళ్ళు వుంటుంది మనతో, లేకపోతే పోయేకాళ్ళొస్తే పోతుంది.

ఇలా యిల్లు కట్టడం గురించి మేము చాలా చాలా సార్లు ఆలోచించాం. యాభైవేల రూపాయలెట్టి సపోజ్ మనం యిల్లు కడితె మన కాపిటల్ బ్లాకయి పోతుంది. 50 వేల మీద నూటికి ఏడురూపాయలు వడ్డీవేసుకున్నా ఏడాదికి మూడువేల ఐదువందలు. సుమారు నెలకు మూడువందల రూపాయలలోపు ఆదాయం వస్తుంది. అదేయిల్లు కట్టేస్తే నెలకు మూడొందలు అద్దెవస్తుందా? రాదు ఎలక్ట్రిక్ బిల్లులు ఇళ్ళ పన్నులు నోటీసులు వస్తాయి. మనం ఆ యింట్లోవుంటే ఆ అద్దెరాదు. పైగా సున్నాలు, బాగోగులు మెయింటెనెన్స్ – ఈ న్యూసెన్సంతా ఆలోచించి మనకి ఇల్లు వద్దండీ అన్నాన్నేను. అద్దె కొంపలోవున్న సుఖం సొంత యింట్లో ఎలా వస్తుంది? అద్దెయింట్లో మనను పన్నులు పీకవు. అదోహోయి – స్వంత యింటిమీద మనకు లాభం రావాలంటే యిల్లంతా అద్దెకిచ్చేసి మనం వేరే అద్దెయింట్లో వుండాలి. ఇల్లు కట్టెయ్యగానే సరదా తీరిపోతుందికదా –

వెంటనే దాన్ని అమ్మివెయ్యాలి. అప్పుడు గాని ప్రాణం హాయిగా వుండదు. మేం ఇల్లు కట్టే ప్రోగ్రాం వాయిదా వేశాం – దానివలన మాకు యాభైవేలమీద నెలకు మూడు వందల రూపాయలు చొప్పున లాభం వస్తోంది. ఇప్పుడు మేం నూట యాభై రూపాయలు అద్దెయిస్తున్నాం – ఇవ్వగా మాకు నూటయాభై మిగుల్తోంది. (అఫ్‌కోర్స్ మా దగ్గర యాభైవేల రూపాయల్లేవనుకోండి. వుంటే నూటయాభై చొప్పున మిగిలేవి) మేము లక్షరూపాయలతో యిల్లు కట్టకుండా వుంటే మాకు నెలకు ఆరు వందలు ఆదా అవుతుంది. మీరైనా అంతే లక్ష రూపాయలుంటే యిల్లు కట్టకండి, మేం అందుకే యిల్లు కట్టడం మానుకున్నాం. మా కిప్పుడు ఇంటి పన్ను పెంచుతారనే బెంగాలేదు. నోటీసు లొస్తాయనే భయమూ లేదు. ఇంట్లో అద్దెకొచ్చేవాళ్ళు ఎలాటి పెంకెఘటాలో అన్న అనుమానమూ లేదు. సొంత యింట్లో మేకు కొడుతూంటే మన గుండెల్లో దిగినట్లుగా వుంటుంది. అద్దె యింట్లో గోడకి మేకు కొడుతూంటే పక్కవాడి గుండెల్లో మేకు దిగుతున్నట్లుగా వుంటుంది. పక్కవాడి గుండెల్లో మేకు దిగితే మనకేం?

# చిట్టిగారెలు

పుణుకుల్లో పెసర పునుకుల్లాగా, గారెల్లో చిట్టిగారెలు పులుల్లో చిరుత పులుల్లాంటివి. నాస్తికుడైనా, నక్సలైటైనా, కారల్‌మార్క్స్ అయినా ఎర్నెస్ట్ హెమ్మింగ్ వే అయినా, జాక్విలిన్ ఒనాసిస్సయినా ఓపలేక చిట్టి గారెలు తినాలనుకుంటే ఆంజనేయులు స్వామికి మొక్కుకోవాల్సిందే! మన గాడ్స్ చాలా భోజన ప్రియులు, తిండి విషయంలో మన యిష్టాలే వారి యిష్టాలు. తేడాలుండవు, మనం పంపు దగ్గర జలకాలాడితే వారు పంచామృతాలు స్నానం చేస్తారు. నైవేద్యాలు మహా నైవేద్యాలు వున్నప్పటికీ భక్తుల పూజాదికాలు పూర్తయ్యే